
ఆయుధ పూజలో పాల్గొన్న ఆలయ ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తి, ఎస్పీఎఫ్ సిబ్బంది

యాదాద్రిలో హోమం.. నిత్య కల్యాణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో బుధవారం స్వయంభువులైన శ్రీలక్ష్మీనరసింహమూర్తులను కొలుస్తూ చేపట్టిన నిత్యారాధనలు పాంచరాత్రాగమ ఆచారంగా కొనసాగాయి. సూర్యోదయానికి ముందస్తు వేళ సుప్రభాతం చేపట్టిన పూజారులు, రాత్రి శయనోత్సవం నిర్వహించారు. బిందెతీర్థం, బాలభోగం, హారతి నివేదించారు. ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులకు సువర్ణ పుష్పార్చన పర్వాలు కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహహోమం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం సంప్రదాయ పూజతో నిర్వహించారు. అలంకార సేవోత్సవం జరిపారు. జోడు సేవలను మంగళ వాయిద్యాల మధ్య చేపట్టారు. భక్తులు క్షేత్రాన్ని సందర్శించి హరి,హరులను దర్శించుకున్నారు. రాత్రి వేళ ఆరాధన నిర్వహించి, ప్రత్యేక అర్చన చేశారు. దర్బార్ సేవోత్సవం నిర్వహించి నిత్యాదాయం వెల్లడించారు. వివిధ విభాగాల నుంచి రూ. 14,34,164 ఆదాయం చేకూరింది.

క్షేత్రంలో ఆయుధ పూజ

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం టీజీఎస్పీఎఫ్ సిబ్బంది ఆయుధ పూజ నిర్వహించింది. కార్యక్రమానికి ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తి, కమాండెంట్ ఎస్పీఎఫ్ త్రినాథ్, ఇన్‌స్పెక్టర్ శేష గిరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి తగ్గిస్తే..ఓకే..!

◆ జిల్లా కేంద్రాసుపత్రిలో మానసిక సమస్యలకు చికిత్సలు



భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆధునిక జీవనశైలిలో శారీరక అనారోగ్య సమస్యలతో పాటు మానసిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొనే వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో మానసిక వైకల్య సమస్యలతో బాధపడేవారు చాలా తక్కువ మంది ఉండేవారు. హైదరాబాద్, ఇతర నగరాల్లోనే వైద్య నిపుణులు ఉండేవారు. నేడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లోనూ ప్రత్యేక వైద్య నిపుణులను నియమించింది. గురువారం **ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం** సందర్భంగా జిల్లాలో మానసిక ఆరోగ్య సమస్యలు, అందిస్తున్న చికిత్సలపై కథనం.

సమస్యలకు కారణాలు ఇలా

మానసిక ఆరోగ్యం అంటే.. మనిషి ఆలోచన విధానం, సమస్యలు ఎదుర్కొని అధిగమించడం. . రోజువారీ దినచర్యను సమర్థవంతంగా నిర్వహించడం. పనిచేసే చోట ఒత్తిడి, చెడు వ్యసనాలు, ఆర్థిక ఇబ్బందులు, తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోలేక ఆందోళన, కుంగుబాటు, ఆత్మన్యూనత భావాలు, డ్రగ్స్ బారిన పడటం, అతిగా సెల్‌ఫోన్ వాడటం తదితర కారణాలతో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రవర్తనలో మార్పును గమనిస్తే కుటుంబ సభ్యుల మానసిక వైద్యులను సంప్రందించి నయం చేసేందుకు కృషి చేయాలి.

అంశం ఇదే..

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది 'ఉద్యోగ, వృత్తి నిర్వహణలో మానసిక ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం' అనే అంశం ఎంచుకుంది. చేపట్టాల్సిన అవగాహన కార్యక్రమాలను జిల్లా ఆసుపత్రిలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగులు ఎదుర్కొనే మానసిక పరమైన సమస్యలు గుర్తించి వారికి కౌన్సెలింగ్, అవసరమైన వారికి ఔషధాలు అందజేసేందుకు గురువారం జిల్లా కేంద్రాసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

జిల్లాలో వైద్యం పొందారు ఇలా.

ఈ ఏడాది జూన్ నుంచి జిల్లా కేంద్రాసుపత్రిలో మద్యం, డ్రగ్స్ వ్యసనాల, ఒత్తిడి, భయాందోళన, ఇతర కారణాలతో వచ్చే మానసిక సమస్యలతో బాధపడుతున్న 167 మందికి చికిత్సలు అందించారు. అందులో మద్యం, డ్రగ్స్ బారిన పడి మానసిక సమస్యలు ఉన్నవారు 84, ఒత్తిడి 34, వివిధ కారణాలతో భయాందోళనలు 24, ఇతర మానసిక వైకల్యంతో బాధపడేవారు 25 మందికి చికిత్స పొందారు.

సేవలు వినియోగించుకోవాలి

– డాక్టర్ శిరీష, సైకియాట్రి ప్రొఫెసర్



పని ప్రదేశాల్లో ఎదుర్కొనే ఒత్తిడి, వేధింపులు, వివక్ష, గుర్తింపు లేకుండా ఉందని బాధపడటం తదితర కారణాలతో మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారు జిల్లా కేంద్రాసుపత్రిలో సైకియాట్రి వైద్యసేవలను వినియోగించుకోవాలి. ఇతర కారణాలతో మనో వైకల్యం వారికి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి.

హృదయాలు మురిసేలా.. ఉయ్యాల పాట..!



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మోత్కూరు, న్యూస్‌టుడే:

ప్రకృతిని ఆరాధించే అతిపెద్ద పండగ బతుకమ్మ. ఏ పూజ చేసిన, కార్యక్రమం నిర్వహించినా పూలతో అలంకరించడం ఆనవాయితీ. కానీ ఆ పువ్వులనే దైవంగా పూజించే అరుదైన వేడుక ఇది. ఈ పండగ వచ్చిందంటే పిల్లల కేరింతలు. .యువతుల ఆటలు.. అమ్మల పాటలు.. తొమ్మిది రోజులు మహిళల్లో కనిపించే ఉత్సాహం మాటల్లో చెప్పలేం. చిన్న ఊరైనా, పెద్ద పట్టణమైన, దేశంలో ఎక్కడ ఉన్నా చివరికి విదేశమైన మనవాళ్లున్న చోటా బతుకమ్మ వేడుక వైభవంగా నిర్వహిస్తున్నారు. ఎనిమిది రోజులపాటు ఆడుకున్న మహిళలు నేడు సద్దుల బతుకమ్మను పెద్దఎత్తున నిర్వహించుకునేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా సిద్ధమయ్యారు.

ప్రత్యేక నైవేద్యం.. ఆరోగ్యం

ఎంగిలిపువ్వు నుంచి ఎనిమిది రోజుల పాటు ఆడుకుంటూ.. తొమ్మిదోరోజున జరిపే వేడుకనే సద్దుల బతుకమ్మ. పెరుగన్నం, చిత్రాన్నం, కొబ్బరిపొడి, నువ్వులపొడి ఇలా.. ఐదురకాల సద్దులతో నైవేద్యం చేస్తారు. బతుకమ్మతో పాటే వివిధరకాల ఫలహారాలను చెరువు దగ్గరికి తెచ్చి పంచిపెడతారు. సత్తుపిండి, పల్లీముద్దలు, సజ్జపిండి పంచుతారు. సజ్జలు, బెల్లం, నెయ్యికలిపి చేసిన పిండి ముద్దలు.. ఇవన్నీ రక్తహీనతను తొలగించేందుకు ఉపయోగపడతాయి. పల్లీ ముద్దలు పిల్లలకు బలవర్ధమైన ఆహారం. సత్తు పిండిగా పిలిచే మొక్కజొన్న పేలాల పిండిలో పీచు పదార్థం వల్ల మలబద్ధకం తగ్గుతుంది.



❍ నేడే సద్దుల బతుకమ్మ

ఇస్తినమ్మ వాయినం..

బతుకమ్మను చెరువుల్లో నిమజ్జనం చేసి బతుకమ్మను పేర్చిన పళ్లాలు, ప్లేట్లలో నీరు తెస్తారు. అందులో గౌరమ్మను ఉంచి పాటలు పాడుతూ, ఓలలాడిస్తారు. మరో ఆసక్తికర అంశం వాయినం. అడవినుంచి సేకరించిన పూలను పంచుకోవడంతో మొదలవుతుంది. ఫలహారాన్ని పరస్పరం ఒకరికి ఒకరు ఇచ్చుకుంటారు. సద్దుల బతుకమ్మరోజు చెరువుదగ్గరకు మలీదముద్దలు తీసుకుని వెళ్తారు. రాగి, జొన్నలు, గోధుమలతో గానీ, బియ్యంతోగానీ తయారైన పిండితో రొట్టెచేసి వాటిని చిన్నచిన్న ముక్కలుగా చేసి దంచి బెల్లం పాకంతో కలిపి చేసిన ముద్దలను మలీద ముద్దలంటారు. వీటిని బతుకమ్మ వాయినాలుగా ఇచ్చిపుచ్చుకుంటారు.

సద్దులు ఇలా..

పెసరముద్దలు.. పెసర్లను ఉడకబెట్టి అందులో బెల్లం కలిపి ముద్దలుగా తయారు చేస్తారు.

సజ్జముద్దలు.. ఈ పండగొస్తే అందరికీ సద్దముద్దలు(సజ్జముద్దలు) గుర్తుకొస్తాయి. ఈ పేరుతోనే పెద్దబతుకమ్మను సద్దుల బతుకమ్మ అంటారని చెబుతారు. ప్రస్తుతం సజ్జలు అంతగా లభించడం లేదు. సద్దలను పిండిగా పట్టించి రొట్టెలు చేస్తారు. రొట్టెలను, బెల్లాన్ని కలిపి దంచి ముద్దలు చేస్తారు.

సత్తుపిండి.. సత్తుపిండిని మొక్కజొన్నలతో చేస్తారు. దీనికి కూడా బెల్లం జోడిస్తారు.

నువ్వుల.. నువ్వులను పొడిచేసి బెల్లంతో ముద్దలు చేస్తారు. పల్లిపిండి.. కొబ్బరిపొడి.. పెరుగన్నం.. పులిహోరలను ఈమధ్య సద్దిగా ఇస్తున్నారు. పెరుగన్నంలో పల్లీలు, వివిధ రకాల ధాన్యాలను కలుపుతున్నారు. చింత పండు లేదా నిమ్మరసంలో చేసిన పులిహోర కూడా ప్రసాదంగా వాడుతున్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ
ఒక్కజామాయె చందమామ
శివపూజ వేళాయె చందమామ
శివుడుజాడలేదు చందమామ
గంగనీ వాకిట చందమామ
బంగారు పాకోళ్లు చందమామ
రెండేసి పూలేసి చందమామ
రెండు జాములాయె చందమామ

★ 'ఇద్దరక్క చెల్లెళ్లాను ఉయ్యాలో
ఒక్కూరికిచ్చిరే ఉయ్యాలో
పెద్దలకువచ్చింది ఉయ్యాలో
పెత్రామాస ఉయ్యాలో
పిల్లలకువచ్చింది ఉయ్యాలో
బతుకమ్మ పండుగ ఉయ్యాలో

మహిళలకు పెద్ద పండుగ..

– డాక్టర్ బండారు సుజాతాశేఖర్ (దేవరకొండ, బతుకమ్మపై పరిశోధకురాలు)



మహిళలకు బతుకమ్మ పండగ ఎంతో పెద్దది. తరతరాలుగా పూలను పూజించే గొప్ప వేడుక ఇది. ఎంతో విశిష్టత కలిగిన ఈ పండగ మన తెలుగువారు ఏ దేశంలో ఉన్నా అక్కడ జరుపుకొంటున్నారు. దీని ప్రాశస్త్యం భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది.

పల్లెల్లో సంబరం అంతాఇంతా కాదు..

– పోరెడ్డి రాజేశ్వరి (ఉపాధ్యాయిని, ఆలేరు)



పల్లెల్లో ఈ పండగ వచ్చిందంటే మహిళల్లో ఎంతో సంతోషం కనిపిస్తుంది. చిన్నా, పెద్ద అంతా కలిసి ఆడుకోవడంలోనే బతుకమ్మ ప్రాధాన్యం ఉంటుంది. ఇంకా గ్రామాల్లో డీజేలకు బదులుగా పాటలు పాడుతూనే ఆడుకుంటున్నారు. నాటితరం వారే బతుకమ్మ పాటలు పాడుతున్నారు. నేటితరం వారూ ఆ పాటలు నేర్చుకుని పండగ ఖ్యాతిని భావితరాలకు అందించాలి.

గింజను బట్టే.. అధనం


ఆలేరు: రాఘవాపురంలో సాగైన సన్నరకం వరి చేను

❍ సన్నరకాలను గుర్తించేందుకు కొత్త నిబంధనలు

ఆలేరు, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్నరకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. యాదాద్రి జిల్లాలో పత్తి తర్వాత అధికంగా బావులు, బోర్లు, కుంటలు, చెరువులు, కాలువల ద్వారా ప్రస్తుత సీజన్‌లో మొత్తం 2,59,543 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో సన్నరకం 31,984 ఎకరాల్లో సాగుచేశారు. సన్న ధాన్యం 70,364 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దసరా తర్వాత కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ సన్నరకం ధాన్యం కొనుగోళ్ల విషయమై కొత్త నిబంధనలు అమలులోకి తీసుకు రానుండటంతో రైతుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది.

కాలిపర్స్‌తో కొలుస్తారట..

చిన్నచిన్న వస్తువుల పొడవు, వెడల్పులను లెక్కించడం కోసం కాలిపర్స్ పరికరాన్ని ఉపయోగిస్తారు. సన్న ధాన్యాన్ని గుర్తించేందుకూ దీన్ని వినియోగించనున్నట్లు సమాచారం. ఇందుకు అవసరమైన కాలిపర్స్‌లను కొనుగోలు చేయడానికి పౌరసరఫరాల శాఖ కొనుగోళ్లకు ఉపక్రమించింది. ప్రతి సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రెండు కాలిపర్స్‌లను అందుబాటులో ఉంచాలని నిర్ణయించినట్లు సమాచారం.

★ ధాన్యంలో పది గింజలను సేకరిస్తారు.. ఒక ప్రత్యేక పరికరంపై వేసి గింజ పొట్టు పోయేలా చేస్తారు. తర్వాత వచ్చిన బియ్యం గింజను కాలిపర్స్ సాయంతో కొలత వేస్తారు. ఈ కొలతలో బియ్యం గింజ 6 మి. మీ కన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు 1 మి. మీకి మించి ఉండరాదు. బియ్యం గింజ పొడవు, వెడల్పుల నిష్పత్తి 2.5మీ.మీ కన్నా ఎక్కువగా ఉండాలి. కాలిపర్స్‌లో పెట్టిన బియ్యం గింజ ఈ కొలతలకు సరిపోతేనే దానిని సన్న ధాన్యంగా పరిగణిస్తారు. అలాంటి వాటికే బోనస్ ఇస్తారు.

అన్నదాతల్లో ఒకింత ఆందోళన..

సన్న ధాన్యం గుర్తింపు విషయమై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. బీపీటీ-5202తోపాటు ఆర్ఎన్ఆర్, జైశ్రీరాం, హెచ్ఎంటీ సోనా, మరో 33 రకాలను సన్న ధాన్యంగా పరిగణించాలని నిర్ణయించింది. మొత్తం ఈ 37 రకాల్లో యాదాద్రి జిల్లాలో ఏడు, ఎనిమిది రకాలు మాత్రమే సాగవుతాయి. వ్యవసాయశాఖ సన్నరకాలుగా ప్రకటించిన జాబితాలో రైతు పండించిన ధాన్యం ఉన్నా.. కొలతల్లో తేడా వస్తే మాత్రం దొడ్డు రకంగా పరిగణిస్తారు. ఈ క్రమంలో రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. క్షేత్రంలో భూసారాన్ని బట్టి గింజ పరిమాణంలో తేడా ఉంటుందని, ధాన్యం గుర్తింపులో ఈ కొలతలు ఎందుకని రైతులు అంటున్నారు. కొలతల పేరిట కొర్రీలు పెట్టి బోనస్‌ను ఎగ్గొట్టేందుకే కొత్త నిబంధనలు అమలులోకి తీసుకువస్తున్నారని అన్నదాతలు విమర్శిస్తున్నారు. 'కాగా సన్నరకం ధాన్యం కొనుగోళ్ల విషయమై ఇంకా మార్గదర్శకాలు రాలేదని, ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఉన్న ధాన్యాన్ని మాత్రమే సన్నరకంగా పరిగణిస్తామని' పౌరసరఫరాల శాఖ, వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.



సహస్ర దీపారాధన

భువనగిరిలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక ఆజాద్‌రోడ్డులోని శ్రీరామ భక్త భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం సహస్ర దీపారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భువనగిరి, న్యూస్‌టుడే:

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరగాలి

భువనగిరి, న్యూస్‌టుడే: వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలిసి పౌరసరఫరాలు, డీఆర్‌డీఏ, రవాణా తదితర సంబంధిత శాఖల అధికారులతో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లపై క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. నాణ్యత ప్రమాణాల మేరకు వడ్లను వేగవంతంగా కొనుగోళ్లు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తరుగు పేరిట బస్తాకు కిలో కంటే ఎక్కువ ధాన్యం తీయొద్దని సూచించారు. ధాన్యం మార్కెట్‌కు వస్తున్నందున కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలో 142 కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, సన్నవడ్ల కొనుగోళ్లకు 12 కేంద్రాలు అదనంగా ప్రారంభిస్తున్నామని తెలిపారు. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వనజాత, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జగదీష్, డీఆర్‌డీ నాగిరెడ్డి పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

పూర్వ వీఆర్వోలను రెవెన్యూశాఖలోకి తీసుకోవాలి

ఆలేరు, న్యూస్‌టుడే: పూర్వ గ్రామ రెవెన్యూ అధికారులను(వీఆర్వో) యథావిధిగా రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల బాలకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆలేరులో బుధవారం పూర్వ వీఆర్వోలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీనియారిటీ, విద్యార్హతలను ప్రామాణికంగా తీసుకోకుండా అందరినీ రెవెన్యూశాఖలోకి తీసుకోవాలన్నారు. పూర్వ వీఆర్వోలను విధుల్లోకి తీసుకుంటూనే.. మిగతా ఖాళీలను అనుభవం కలిగిన వీఆర్‌ఏలతో భర్తీ చేయాలన్నారు.

నయనం.. ఎటువైపు పయనం..!


మిర్యాలగూడలోని ఓ పాఠశాలలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు (పాత చిత్రం)

◆ నేడు 'ప్రపంచ దృష్టి దినోత్సవం'

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవలి కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా రెండేళ్ల చిన్నారి నుంచి 70 ఏళ్ల వృద్ధుడి వరకు ప్రతి ఒక్కరు కంటి సమస్యలతో బాధపడుతూ.. కళ్లకు అద్దాలతో దర్శనమిస్తున్నారు. ప్రస్తుత కాలంలో అన్ని వయస్సుల వారు చరవాణి, ల్యాప్‌టాప్, కంప్యూటర్, టీవీ తెరలకు అతుక్కుపోతుండటంతో ఇందుకు కారణం. కంటిపై ఒత్తిడి పెరిగి చూపు మందగిస్తుంది. శరీరంలో అత్యంత ప్రధానమైన కళ్లను కాపాడాలనే ఉద్దేశంతో ఏటా అక్టోబరు రెండో గురువారం 'ప్రపంచ దృష్టి దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇటీవల కాలంలో చేపట్టిన కంటి పరీక్షలు, సమస్యలు ఉన్న వారి వివరాలు..

జిల్లా	పరీక్షించిన విద్యార్థులు	సమస్యలు ఉన్నవారు
నల్గొండ	48,794	2,960
సూర్యాపేట	26,177	841
యాదాద్రి	13,710	931

ప్రభుత్వ చర్యలు..

పిల్లల్లో కంటి సమస్యలు అధికంగా వస్తున్నాయని గ్రహించిన ప్రభుత్వం వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఆర్బీఎస్కే, నేత్ర వైద్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఐదో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. గత నెల 20 నుంచి ఈ నెల 2 వరకు నల్గొండ జిల్లాలో సుమారు 48,794 మందికి పరీక్షలు నిర్వహించగా.. 2,960 మందిలో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు, సూర్యాపేట జిల్లాలో మొత్తం 26,177 మందికి పరీక్షలు నిర్వహించగా.. 841 మందిలో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. సమస్యలు ఉన్న వారికి చికిత్స అందించేందుకు సిఫారసు చేశారు.

పాటించాల్సిన నియమాలు..

- ☛ ప్రతి 20 నిమిషాలకు ఒకసారి తెర నుంచి దృష్టిని మరల్చాలి.
- ☛ తెర వెలుతురు కంటే బయటి వెలుతురు ఎక్కువ ఉండేలా చూడాలి.
- ☛ రోజులో రెండు గంటలకంటే ఎక్కువ సేపు తెరలను చూడకపోవడం మంచిది.
- ☛ ధూమపానం కళ్లను పొడిబారేలా చేసి.. కంటి చూపును దెబ్బతీస్తుంది.
- ☛ అపరిశుభ్రమైన చేతులతో కళ్లను తాకడం వల్ల ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది.
- ☛ సరిపడా నీళ్లు తాగడం వల్ల కళ్లలో తేమ శాతం పెరిగి కంటి సమస్యలు నివారించవచ్చు.
- ☛ కంటి ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి విటమిన్ ఏ, సి, ఈ అధికంగా ఆహారాలు తరచుగా తీసుకోవాలి.

పిల్లల్లో పెరిగిన కంటి సమస్యలు:

డాక్టర్ బీసం కిరణ్, కంటి వైద్యుడు, ప్రాంతీయ వైద్యశాల, మిర్యాలగూడ



కరోనా అనంతరం మారిన పరిస్థితుల కారణంగా మూడేళ్ల వయసు పిల్లల నుంచే కంటి సమస్యలు రావడం మొదలైంది. దీనికి ప్రధాన కారణం ఫోన్, టీవీ వంటి తెరలను పరిమితికి మించి చూడటం. రోజులో కేవలం 30 నిమిషాలు మాత్రమే పిల్లలు తెరలు చూసేలా కట్టడి చేయాలి. నిత్యం కనీసం రెండు గంటల పాటు మైదానంలో ఆటలాడటం వల్ల దూరపు చూపు అలవాటవుతోంది. మధ్య వయస్కుల్లో వచ్చే చత్వారం, శుక్లాల సమస్యను చికిత్సతో నయం చేయొచ్చు. కంప్యూటర్ తెరలను అదే పనిగా చూసే ఉద్యోగులు కనీసం గంటకోసారి రెండు నిమిషాల పాటు కళ్లు మూసుకోవాలి.

నల్గొండ జిల్లాల్లో ఆర్బీఎస్కే వైద్య బృందం, చేసిన పరీక్షల వివరాలు...

ఆర్బీఎస్కే వైద్యాధికారి	కేంద్రం	పరీక్షల సంఖ్య
నితిన్	మిర్యాలగూడ	6,527
గణేష్	మిర్యాలగూడ	6,372
రాంరెడ్డి	నకిరేకల్	6,077
దయానంద్	మర్రిగూడ	6,243
విజయ్‌కుమార్	మర్రిగూడ	5,700
నర్సింహ	దేవరకొండ	5,935
మల్లేష్	దేవరకొండ	6,105
రాంబాబు	హాలియా	5,835

పరీక్షల్లో వెలుగు చూసిన అంశాలు ఇలా..


☛ త్రిపురారం మండలం రాగడప గ్రామానికి చెందిన ఓ బాలికకు రెటీనాస్ డిసీస్ కారణంగా పుట్టుకతోనే కంటిలో శుక్లాలు ఉండగా.. 15 సంవత్సరాల వయస్సులో గుర్తించి.. శస్త్రచికిత్సకు సిఫారసు చేశారు.

☛ మిర్యాలగూడ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థినికి శుక్లాలు వచ్చినట్టు గుర్తించి శస్త్ర చికిత్సకు సిఫారసు చేశారు.

☛ మిర్యాలగూడలోని ఏడు కోట్ల తండాకు చెందిన ఓ బాలుడు పుట్టుకతోనే ఎమారోసిస్ అనే వ్యాధి బారిన పడి కంటి చూపు మందగించడం గుర్తించారు.

☛ మిర్యాలగూడకు చెందిన ఓ ఎల్కేజీ విద్యార్థికి కంటి పరీక్షలు చేయగా.. మైనస్ 8గా నమోదు కావడంతో వైద్యులు కంగుతిన్నారు.

☛ ఓ ఆరేళ్ల బాలుడికి కంటి పక్షవాతం ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్స చేసి సరి చేశారు.



మహిషాసుర సంహారం.. విశిష్టతల సమాహారం


మట్టపల్లి: నవరాత్రుల్లో పూజ లందుకుంటున్న దుర్గాదేవి

మఠంపల్లి, న్యూస్‌టుడే: హిందువుల ముఖ్యమైన పండగలలో ప్రధానమైన దసరాకు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. తొమ్మిది రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిపారవశ్యంతో గడిపే ఈ నవరాత్రుల్లో శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిస్తారు.

◆ శరదృతువు ఆరంభంలో వచ్చే ఈ పర్వదినాన్ని శరన్నవరాత్రిగా, జగన్మాత మహిషాసురుడితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి ఆ రాక్షసుడిని వధించిన రోజును విజయదశమిగా వ్యవహరిస్తారు. పలు ప్రాంతాలలో మొదటి మూడు రోజులు పార్వతీదేవిని, తదుపరి మూడు రోజులు లక్ష్మీదేవిని, చివరి మూడు రోజులు సరస్వతీదేవిని ఆరాధిస్తారు. ఇదే రోజు శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించడం, పాండవులు వనవాసానికి వెళ్తూ జమ్మిచెట్టుపై ఉంచిన తమ ఆయుధాలను తిరిగి తీసుకున్నారని పురాణ కథనం.

◆ దుర్గాష్టమి నాడు అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిస్తుంది. మహిషం అంటే దున్నపోతు(పశువు). పశుత్వం నుంచి అసుర(రాక్షస) శక్తులు వస్తాయి. తద్వారా దుష్టబుద్ధులు, దురాచారాలు ప్రబలుతాయి. వాటిని మర్దనం చేసే తల్లిగా కనకదుర్గ మహిషాసుర మర్దినిగా అవతరించింది. విజయదశమి రోజు జగన్మాత శ్రీరాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తుంది. నాలుగు చేతుల్లో పాశం, అంకుశం, చెరుకుగడ, పుష్ప బాణం ధరించి అపరాజితాదేవిగా, దివ్యమంగళ స్వరూపిణిగా సాక్షాత్కరిస్తుంది.

శమీపూజకు ప్రాధాన్యం:

–ఫణిశర్మ ఘనపాటి, ఎస్‌ఎల్‌ఎన్ వేద పాఠశాల అధ్యాపకుడు, మట్టపల్లి

శమీ అంటే జమ్మిచెట్టు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న ఈ వృక్షాన్ని విజయదశమి రోజు ఆరాధించడం లక్ష్మీప్రదం. పూజల అనంతరం శమీ పత్రాలను దేవుని మందిరాలలో, నగదు భద్రపరిచే పెట్టెలలో ఉంచాలి. 'శమీ శమయతే పాపం శమీశత్రు వినాశనీ.. అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ' శ్లోకాన్ని స్మరిస్తూ శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశాక శ్వేత పత్రంపై ఈ శ్లోకం రాసిన కాగితాలను చెట్టు కొమ్మలకు తగిలించాలి. దీనివల్ల అభీష్టాలు నెరవేరతాయి.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చౌటుప్పల్‌లో చోటుచేసుకుంది. చౌటుప్పల్‌కు చెందిన బాతరాజు నర్సింహ(62) సంస్థాన్‌నారాయణపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. పదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నర్సింహ మంగళవారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందారు. మృతుని భార్య సుగుణమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై యాదగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

అందమైన ఉపాధి..!


హీరోయిన్ రితికా సింగ్‌కు మేకప్ చేస్తున్న నాగవెల్లి వెంకట్

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

జీవనోపాధి కోసం చేసే కుల వృత్తిని ఆధునిక అవసరాలకు తగిన విధంగా మెరుగు పరచుకుని.. తనదైన్‌శైలిలో సెలబ్రిటీలకు, ప్రముఖులకు అందాలను మెరుగులద్దుతూ తాను ఉపాధి పొందుతూ మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నాడు మిర్యాలగూడ పట్టణానికి చెందిన 'వెంకీస్ హెయిర్ అండ్ బ్యూటీ ఫ్యామిలీ సెలూన్' నిర్వాహకుడు నాగవెల్లి వెంకట్.

★ పట్టణానికి చెందిన నాగవెల్లి రాము, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు వెంకట్ డిగ్రీ చదువుతూనే పార్ట్‌టైం సెలూన్‌లో పనిచేసేవాడు. ఆధునిక హెయిర్ స్టైల్‌పై అవగాహన పెంపొందించుకున్న ఆయన డిగ్రీ పూర్తి కాగానే 2009లో హైదరాబాద్‌కు వెళ్లి 'మానియా', మిర్రర్ వంటి సంస్థల్లో చేరి శిక్షణ పొందాడు. 2014లో మిర్యాలగూడకు వచ్చి బబుల్స్‌ను ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం వెంకీస్ పేరుతో మరో సెలూన్‌ను ఏర్పాటు చేశాడు. తనదైన్‌శైలిలో ప్రముఖులకు, సెలబ్రిటీలకు, సినిమా హీరోలు, హీరోయిన్‌లకు హెయిర్ స్టైలిస్ట్, మేకప్ మెన్‌గా పనిచేస్తున్నాడు. మిర్యాలగూడలో తన సంస్థలో పది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ.. హైదరాబాద్‌కు వెళ్లి ఆర్డర్లపై వివాహాలు, సినిమా షూటింగ్‌లకు మేకప్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సినీ హీరో చిరంజీవి కుటుంబానికి మేకప్ మెన్‌గా పనిచేస్తున్న 'టీను'తో కలిసి నాగవెల్లి వెంకట్ పనిచేస్తున్నాడు. ఇప్పటి వరకు సానియా మీర్జా, పీ.వీ సింధూ, హీరోయిన్లు శివాత్మిక, రితికాసింగ్, నిత్యాశెట్టి, హీరోలు అడవిశేషు, సహాయ, సీరియల్ నటులకు సైతం మేకప్ చేస్తున్నాడు. ఆసక్తి కలిగిన యువతకు శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తానని చెబుతున్నాడు నాగవెల్లి వెంకట్.

హాయిగా వెళ్లొచ్చిక..!


సూర్యాపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్న ప్రయాణికులు (పాతచిత్రం)

◆ పండగ వేళ ఆర్టీసీ ముందస్తు రిజర్వేషన్

భానుపురి, కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: దసరా పండగకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సంస్థకు ఆదాయాన్ని పెంచటం, ప్రయాణికుల రద్దీని తట్టుకొని మెరుగైన సేవలందించాలనే సంకల్పంతో ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. పండగల నేపథ్యంలో విద్యా, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉన్నవారు సైతం తమ సొంత ఊరిబాట పడుతున్నారు. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని బస్టాండ్‌లలో ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది.

ఎంజీబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు..

దసరా వేడుకల సందర్భంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా జిల్లాకు చెందిన బస్సులే కాకుండా ఎంజీబీఎస్ (మహాత్మాగాంధీ బస్‌స్టేషన్) నుంచి 639 బస్సులను ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉమ్మడి నల్గొండకు కేటాయించారు. ఈ నెల 15 వరకు బస్సులు ఆయా ప్రాంతాల్లో తిరగనున్నాయి. ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ముందుగా ఆన్‌లైన్ రిజర్వేషన్ అవకాశం కల్పించారు. ప్రయాణికులు WWW.TGSRTCBUS.IN/ORS.WEB లో ముందస్తు టికెట్ రిజర్వేషన్ చేసుకొని తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చు.

పర్యవేక్షణ ఇలా..


ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండ్లను శుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీటి వసతి కల్పిస్తున్నారు. డిప్యూటీ ఆర్‌ఎంలు, రీజియన్‌లోని డిపోల డీఎంలు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు పర్యవేక్షణ చేపడుతున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

– రాజశేఖర్, ఆర్‌ఎం, నల్గొండ

దసరా పండగ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్ రిజర్వేషన్ చేసుకోవాలి. ఎంజీబీఎస్ నుంచి ఉమ్మడి జిల్లాకు 639 బస్సులే కాకుండా జిల్లాకు చెందినవి 640 నడుస్తున్నాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

పద్దు.. తారుమారు..!



నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండకు చెందిన నరేష్‌కుమార్ చిరు ఉద్యోగి. కొద్దిపాటి వేతనంతో కుటుంబ జీవనం సాగిస్తున్నారు. ప్రతి నెల ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, ఇతర అవసరాలకు ప్రణాళిక పద్ధతిలో ఖర్చులు వెచ్చిస్తుంటారు. కొద్ది రోజులుగా, కూరగాయల ధరలతో లోటు బడ్జెట్ ఎదుర్కొంటున్నారు. గత వారం రోజుల్లోనే నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరగడంతో అదనంగా రూ. రెండు వేల నుంచి రూ. మూడు వేల వరకు ఆర్థిక భారం పెరగడంతో నరేష్ లాంటి మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమవుతున్నాయి.

❐ దసరా పండగ వేళ బియ్యం, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. మార్కెట్లల్లో వ్యాపారులు, దళారుల రాజ్యం నడుస్తోంది. గడిచిన వారం రోజుల్లోనే టమాట ధర నాలుగు రెట్లు పెరిగింది. ఒక కిలో రూ. 25 లభించగా, ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ. 100కు చేరుకుంది. దాని వెనుకాలే ఉల్లి, వెల్లుల్లితోపాటు మిగతా కూరగాయల ధరలు పరుగులు పెడుతున్నాయి. మరో పక్క సన్న బియ్యం క్వింటాల్ గత ఏడాది రూ. 5600వరకు ఉండగా ప్రస్తుతం రూ. 6200 నుంచి రూ. 7 వేల వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇక కంది పప్పు, పెసర, శనగ పప్పులు ఒక కిలోపై రూ. 5 నుంచి రూ. 40 వరకు అదనంగా పెరిగాయి.

❐ పండగల సీజన్‌లో ఒక్కసారే నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. గత నెలలో కిలో రూ. 110 ఉన్న నూనె ప్రస్తుతం కిలో రూ. 135 వరకు చేరింది. అంటే ఒక కిలోపై రూ. 20 అదనంగా పెరిగింది. దీంతో 5 కిలోలు వాడుతున్న కుటుంబాలు 3 కిలోలకు తగ్గించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో ఐదు లక్షలకు పైగా కుటుంబాలున్నాయి. నెలకు 2.5 లక్షల లీటర్ల నూనె వినియోగం ఉంటుందని వ్యాపారుల అంచనా. ఈ లెక్క ప్రకారం రూ. 9 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. పర్వదినాలు రావడంతో పిండి వంటలకు నూనె వినియోగం తప్పని సరి కావడంతో ఏం చేయాలన్న మీమాంసలో ప్రజలు పడిపోయారు.

అంతా చేరి..అమ్మను కొలిచి..!



దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నవశక్తి యూత్ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లిలోని వేణుగోపాలస్వామి గుడి దగ్గర నెలకొల్పిన అమ్మవారి విగ్రహం వద్ద బుధవారం మహిళలు కనకపూజ, పసుపు కుంకుమ పూజ నిర్వహించారు.
– న్యూస్‌టుడే,నార్కట్‌పల్లి గ్రామీణం

ఆహ్లాదం.. ఆలయ నగరి



నారసింహుడి దర్శనానికి వచ్చే భక్తులను ఆహ్లాదకరమైన పరిసరాలు ఆహ్వానిస్తున్నాయి. చుట్టూ కొండల నడుమ పెద్దగుట్ట.. ఆ గుట్టపైనే భక్తుల బస కోసం ప్రత్యేక వసతుల ద్వారా నిర్మించనున్న ఆలయనగరి పచ్చదనంతో కనువిందుగొల్పుతోంది. పూల ప్రాంగణాలు ఆకట్టుకుంటున్నాయి. – న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట

పంటల రక్షకులుగా.. డీలర్లకు శిక్షణ


కంపసాగర్ పరిశోధన కేంద్రంలో శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల రక్షణలో ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు రైతులకు సలహాదారులుగా మారుతున్నారు. డీలర్లకు సరైన శిక్షణ అందిస్తే ఏ పంటలకు, ఎలాంటి ఎరువులు, ఎంత మోతాదులో ఇవ్వాలనే అవగాహన ఉంటుందని వ్యవసాయశాఖ భావించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసు ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్ఐ) కోర్సును కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. శాస్త్రవేత్తలు, అనుభవం కలిగిన వ్యవసాయాధికారులతో ఏడాదిపాటు డీలర్లకు శిక్షణ అందివ్వనున్నారు.

◆ పంటల సాగులో మెలకువలు, తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాల్సి ఉండగా.. చాలా మంది రైతులు నేరుగా డీలర్లను ఆశ్రయిస్తున్నారు. వారు సూచించే మందులు కొనుగోలు చేసి వాడుతున్నారు. దీంతో శిక్షణ తరగతుల్లో విత్తనాలు, వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, వైరస్‌లు సోకే దశ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు డీలర్లకు వివరిస్తారు. ఏడాదిలో 48 తరగతులు నిర్వహిస్తున్నారు. 8 రోజుల పాటు క్షేత్ర స్థాయి సందర్శనలు ఉంటాయి. 40 రోజులు వ్యవసాయ అంశాలపై తరగతులు బోధిస్తున్నారు.

◆ నల్గొండ జిల్లా కంపసాగర్ కేవీకే కేంద్రంలో, మల్లేపల్లిలో ప్రస్తుతం వ్యవసాయశాఖ పరిధిలోని డీలర్లకు శిక్షణ ఇస్తున్నారు. గతేడాది నుంచి వారానికి ఒక రోజు చొప్పున ప్రతి విడతలో 40 మంది డీలర్లకు శిక్షణ నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయి సందర్శనలో విత్తనోత్పత్తి, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో పురుగు మందుల డీలర్ల ధ్రువీకరణ పత్రం పొందాలంటే తప్పనిసరిగా డిగ్రీలో బీఎస్సీ (రసాయన శాస్త్రం) చేసిన వారికే అవకాశం ఉండేది. ప్రస్తుతం పది ఉత్తీర్ణత సాధించి లైసెన్సు కలిగిన డీలర్లు ఈ శిక్షణకు హాజరై పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధిస్తే ధ్రువీకరణ పత్రం పొందవచ్చు.

దసరా తరువాత మరో రెండు బ్యాచ్‌లకు..

ఉమ్మడి జిల్లాలో నల్గొండలోని డీఏవో కార్యాలయంలో రెండు బ్యాచ్‌లకు శిక్షణ ప్రారంభిస్తారు. యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కో బ్యాచ్‌కు శిక్షణ నిర్వహిస్తారు. డీలర్ల శిక్షణకు రూ. 10 వేలు, ఇతరులు శిక్షణ తీసుకుంటే రూ. 20 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

48 వారాలపాటు..

పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

విత్తన, ఎరువుల డీలర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ కోర్సు అమలు చేస్తోంది. ఏడాదికి 48 వారాలపాటు ఈ శిక్షణ ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన వారు విత్తన, పురుగు మందుల లైసెన్సు తీసుకోవచ్చు. పంటల సాగులో తీసుకోవాల్సిన చర్యలపై విత్తన, ఎరువుల డీలర్లతో పాటు ఇతరులు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

ధాన్యం కొనుగోళ్లలో సమస్యలా.. 99634 07064

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం నల్గొండ సమీపంలోని ఆర్జాలబాయి వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించారు. వానాకాలం ధాన్యానికి సంబంధించి రైతులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడినా, చెల్లింపుల్లో ఆలస్యమైనా జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబరు 9963407064కి ఫోన్ చేయాలని సూచించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నాగరత్నం రాజు అధ్యక్షత వహించగా.. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పౌరసరఫరా శాఖ డీఎం హరీష్, వ్యవసాయశాఖ జేడీ శ్రవణ్‌కుమార్, మార్కెటింగ్ ఏడీ ఛాయదేవి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ ఛైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 114–00	డ్రెస్డ్ 197–00	
రిటైల్ 136–00	స్కిన్‌లెస్ 224–00	

గడువు పెంచారు..!


గోదాము ముందున్న బియ్యం లారీలు(పాత చిత్రం)

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ఎట్టకేలకు కేంద్రం సీఎంఆర్ బియ్యం పెట్టేందుకు గడువు పెంచింది. ఈనెల 31 వరకు గడువు ఇచ్చింది. గతనెల 30 వరకు గడువు ఉన్నప్పటికీ వివిధ కారణాలతో మిల్లర్లు పూర్తి చేయలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ బియ్యం పెట్టేందుకు గడువు ఇవ్వాలని కోరుతూ గత నెల 13నే కేంద్రానికి లేఖ రాసింది. ఇటీవలే భారత ఆహార సంస్థ.. సీఎంఆర్ బకాయి ఉన్న మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి, గడువు పెంచి బియ్యం వసూలు చేయాలని నివేదిక ఇవ్వడంతో మరో నెల రోజులు గడువు పెంచింది. గతంలో 90 రోజులు గడువు పెంచిన ప్రభుత్వం ఈసారి ఒక నెల మాత్రమే అవకాశం ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రస్తుతం పెడుతున్న సీఎంఆర్ బియ్యంపై గట్టి నిఘా ఉంచాలని, నిబంధనలకు అనుగుణంగా బియ్యం ఉండేలా చూడాలని, రేషన్ బియ్యం తిరిగి సీఎంఆర్‌కు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తాజాగా ఇచ్చిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

లక్ష్యం పూర్తికి అవకాశం.. ఎఫ్‌సీఐ అధికారులు ఇటీవల మూడు రోజుల్లో బకాయి మిల్లుల్లో తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. మిల్లుల్లో ధాన్యం ఉన్నందున లక్ష్యాన్ని పూర్తి చేయవచ్చునన్న నివేదిక ఆధారంగానే గడువు పెంచారు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రోజువారీ లక్ష్యాలను పెట్టి వసూలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరో వారంలో 2024-25 వానాకాలం సీజన్ ధాన్యం రాక ప్రారంభం అవుతుంది. కొన్న కొత్త ధాన్యాన్ని మిల్లులకు కేటాయించాలి. ప్రస్తుతం ఉన్న నిబంధన ప్రకారం బకాయి ఉన్న మిల్లులకు ధాన్యం ఇచ్చే అవకాశాలు లేవు. కాబట్టి మిల్లర్లు కూడా ఈసారి త్వరితగతిన తమ లక్ష్యాలను పూర్తి చేసే అవకాశం ఉంది.

జ్ఞాపకం.. ఆయన వ్యాపకం

★ 200 చరవాణి నంబర్లు ఏకబిగిన చెప్పడం ఈయన ప్రత్యేకత


జీడిపల్లి రాజిరెడ్డి

రాజపేట మండలం నెమిల గ్రామానికి చెందిన 77 ఏళ్ల వృద్ధుడు చదివింది కేవలం ఐదో తరగతే. అయినా ఏకబిగిన 200 చరవాణి నెంబర్ల వరకు ఎక్కడా చూడకుండా చెబుతుంటారు. తన చరవాణిలో ఇప్పటి వరకు ఒక్క నెంబరు కూడా నమోదు చేసుకోకపోవడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారులు మొదలుకుని ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల చరవాణి నెంబర్లను నోటికే చెప్పడం ఈయన ప్రత్యేకత. తన బంధువులు, గ్రామంలోని వారి నెంబర్లను కూడా ఇట్టే చెప్పేయగలరు. వ్యవసాయ సాగు పనికి ఉపయోగ పడే కూలీలవి, ఎరువుల దుకాణ యజమానులు, ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు, రైసుమిల్లు యజమానులవి గుర్తు పెట్టుకున్నారు. ఇటీవలనే మాజీలైన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులవి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులవి కళ్లుమూసుకుని టకటకా చెబుతూనే ఉంటారు రాజిరెడ్డి. తన బంధువులు, ప్రముఖుల ల్యాండ్ ఫోన్‌నెంబర్లను సైతం వివరిస్తుంటారు. ఎవరి నెంబర్‌నైనా ఒకసారి మననం చేసుకుంటే చాలు జీవిత కాలం గుర్తుండి పోతుందని అంటున్నారు రాజిరెడ్డి. గ్రామంలో ఏ ఆపద సమయంలోనైనా అత్యావసరంగా ఎవరి చరవాణి నెంబర్ కావాలన్నా ఈయనకు ఫోన్‌చేసి అడుగుతుంటారు. నెంబర్లు గుర్తుంచుకోవడం ఈయనకు దశాబ్దకాలంపైగా అలవాటైంది. పిల్లలు, మనవల పుట్టిన తేదీలు, పెళ్లిరోజులు, ఇతర కార్యక్రమాలు తేదీలను అలవోకగా చెబుతుంటారు.

◆ నెమిలకు చెందిన రాజిరెడ్డిది పూర్తిగా వ్యవసాయ ఆధారిత కుటుంబం. తనకున్న 14 ఎకరాలకు నాలుగు ఎకరాల్లో వరి, 6 ఎకరాల్లో పత్తి సాగును చేపడుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్య ఆండాళు, కుమారులు నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, కుమార్తె సుజాత ఉన్నారు. అందరికీ వివాహాలు జరిపించగా కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. –న్యూస్‌టుడే, రాజపేట, ఆలేరు.

జాగ్రత్తలు పాటించకపోతే కఠిన చర్యలు



కోదాడ, న్యూస్‌టుడే: మాంసం విక్రయించే దుకాణంలో వేలాడదీసిన మాంసాన్ని కుక్క తిన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలో ఓ మటన్ సెంటర్ దుకాణాదారుడు దుకాణం తెరిచి బయటకు వెళ్లాడు. ఎవరూ లేకపోవడంతో దుకాణానికి వేలాడదీసిన మాంసాన్ని కుక్క తింటుండగా ఓ స్థానికుడు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో అది వైరలైంది. దీంతో పురపాలక కమిషనర్ రమాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి బుధవారం దుకాణాన్ని పరిశీలించి సీజ్ చేశారు. దుకాణదారుడికి రూ. 2,000 చలానా విధించారు. జాగ్రత్తలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ దుకాణదారులను హెచ్చరించారు.

హైవేపై వాహనాల రద్దీ.. హోటళ్లు కిటకిట



చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా సెలవులు రావడంతో రాజధాని హైదరాబాద్‌లో నివాసం ఉండే తెలుగు రాష్ట్రాల ప్రజలు సొంతూళ్ల బాట పడుతున్నారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరుతున్నాయి. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో హైవేపై ఉన్న హోటళ్లు, రెస్టారెంట్‌లకు గిరాకీ పెరిగింది. మార్గమధ్యలో ప్రయాణికులు హోటళ్ల వద్ద ఉదయం టిఫిన్, టీకి, మధ్యాహ్నం భోజనానికి ఆగుతుండటంతో జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. వ్యాపారం కూడా సాధారణ రోజుల కంటే అధికంగా జరుగుతున్నట్లు హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని పేరొందిన హోటళ్లలో ప్రయాణికులకు సీట్లు లభించక, వాహనాల పార్కింగ్‌లో స్థలం లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు.

విధుల్లోనే ప్రాణాలు విడిచిన పోలీసు


పుట్ట యాదగిరి

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న పోలీసు గుండెపోటుతో ప్రాణాలను విడిచిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా కేంద్రంలోని నందీశ్వర్ కాలనీకి చెందిన పుట్ట యాదగిరి(59) తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. పంతంగి నుంచి టేకుమట్ల వరకు హైవే పెట్రోలింగ్ వాహనంపై యాదగిరి పని చేస్తారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వీఐపీలు వెళ్లేటప్పుడు వారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ పెట్రోలింగ్ వాహనంపై పని చేసేవారు చూస్తారు. బుధవారం ఉదయం ఏపీకి చెందిన ఓ మంత్రి హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్తుండటంతో బుధవారం ఉదయం 7:30 నిమిషాలకు పెట్రోలింగ్ వాహన సిబ్బంది పంతంగి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. యాదగిరి మూత్రవిసర్జనకు వెళ్లి అక్కడే కుప్పకూలిపోవడంతో తోటి పోలీసులు గమనించి వెంటనే చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే యాదగిరి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

గౌరమ్మను పూజించి.. ఆశీస్సులు ఆకాంక్షించి


బతుకమ్మలతో ఉన్న గౌరమ్మకు పూజలు నిర్వహిస్తున్న జిల్లాజడ్జి నాగరాజు

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: న్యాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ పండగను ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి నాగరాజు తన కుటుంబంతో సహా పాల్గొని పూజలు నిర్వహించారు. జిల్లాజడ్జి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాముఖ్యాన్ని బతుకమ్మ చాటుతుందని, న్యాయశాఖ ఉద్యోగులు బతుకమ్మ పండగను ఇక్కడ నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆయన ఆకాంక్షించారు.

❐ న్యాయమూర్తి కుమార్తె రిత్విక ఉద్యోగులతో కలిసి బతుకమ్మను కీర్తిస్తూ పాటలు పాడటం అందరిని ఆకర్షించింది. అందంగా అలంకరించిన బతుకమ్మలకు జిల్లాజడ్జి నాగరాజు బహుమతులను అందజేశారు. జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు మాతంగి వీరబాబు, సభ్యులు గిరి, ఉషారాణి, లతీఫ్, రాంబాబు, వెంకటమ్మ, సరిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీచక్రాలు, శివలింగాల ప్రతిష్ఠాపన



శివలింగాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నాగిరెడ్డిపల్లి లోని శివశక్తి శిరిడి సాయి అనుగ్రహ మహాపీఠం(రమణే శ్వరం)లో దేవీ నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా చేపట్టిన 1023 శ్రీచక్రాల ప్రతిష్ఠాపనోత్సవాలలో భాగంగా ఏడో రోజు బుధవారం సద్గురు రమణానందమహర్షి 33 శివలింగాల ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నిక కోసం అర్హత గల ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకోవాలని సహాయ రిటర్నింగ్ అధికారి, చౌటుప్పల్ ఆర్డీవో వెల్ల శేఖర్‌రెడ్డి తెలిపారు. 2018 నవంబరు 1 నుంచి 2024 నవంబరు 1 మధ్య ఆరేళ్లలో మూడేళ్ల పాటు ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాలయాల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. ఈ జిల్లాల పరిధిలో ఎక్కడ సాధారణ ఓటరుగా నమోదై ఉంటే అక్కడి నుంచి ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు ఫారాలు (ఫారం-19) తహసీల్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో అందజేయాలని తెలిపారు. ఓటు నమోదుకు ఈనెల 16న తొలి నోటిఫికేషన్ విడుదలవుతుందని, నవంబరు 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తామని, నవంబరు 30న తుది జాబితా ప్రకటిస్తారని వెల్లడించారు. 1400 ఓటర్ల వరకుంటే ఒక పోలింగ్ బూత్, అంతకు మించి ఓటర్లుంటే రెండో పోలింగ్ బూత్ ఏర్పాటవుతుందని తెలిపారు.

కల కొలువుదీరిన వేళ

ఉపాధ్యాయ కొలువు సాధించాలనే పట్టుదలతో కష్టపడి చదివారు.. కుటుంబ సభ్యుల సహకారంతో పోటీ పరీక్షల్లో రాణించారు. అత్యుత్తమ మార్కులతో తాజాగా వెలువడిన డీఎస్సీ-2024 ఫలితాల్లో వలిగొండ మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు పలు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన నియామక పత్రాలు తీసుకున్న వారిని 'న్యూస్‌టుడే' పలకరించగా వారి మాటల్లో..
- వలిగొండ, న్యూస్‌టుడే

కష్టాలకు అధిగమించి



- పారుపల్లి మత్స్యగిరి, మునగాలతుర్కపల్లి

వలిగొండ మండలం మునగాల తుర్కపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పారుపల్లి ఈదయ్య - ఆండాలు దంపతుల పెద్ద కుమారుడు మత్స్యగిరి ఎంఏ బీఈడీ వరకు చదువుకున్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ ఆయన్ను చదివించారు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని తపనతో ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే రెండు నెలల క్రితం గురుకుల పీజీటీ ఉద్యోగం సాధించారు. తాజాగా డీఎస్సీ ఫలితాల్లో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి నియామక పత్రాన్ని తీసుకున్నట్లు మత్స్యగిరి చెప్పారు.

కార్యదర్శిగా..



- పోలేబోయిన రమేశ్, గోపరాజుపల్లి

వలిగొండ మండలం గోపరాజు పల్లి గ్రామానికి చెందిన పోలేబోయిన అంజయ్య- అంజాలి దంపతుల రెండో కుమారుడు రమేశ్ ఎంఎస్సీ, ఎంఏ, బీఈడీ, టీటీసీ చదివారు. భూదాన్‌పోచంపల్లి మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూనే ఉద్యోగానికి సన్నద్ధమయ్యారు. తాజాగా వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ ఉద్యోగం సాధించారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా చేస్తూ



- గంగాదారి రామమూర్తి, లింగరాజుపల్లి, వలిగొండ మండలం

వలిగొండ మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన గంగాదారి భిక్షపతి-మైసమ్మ దంపతుల పెద్ద కుమారుడు రామమూర్తి ఎంఏ బీఈడీ పూర్తి చేసి ప్రైవేట్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. గతంలో పలు పోటీ పరీక్షలు రాసి ఉద్యోగం రాకపోయినా కుటుంబ సభ్యుల సహకారంతో అధైర్యపడకుండా తమ ఇంట్లో సమయం దొరికినప్పుడు వృథా చేయకుండా ప్రణాళిక ప్రకారం చదివారు. తాజాగా వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో తెలుగు పండిట్ ఉద్యోగం సాధించారు.

భర్త ప్రోత్సాహంతో విజయం



- తిరుమల మౌనిక, వలిగొండ

వలిగొండ మండల కేంద్రానికి చెందిన తిరుమల మౌనిక బీఎస్సీ బీఈడీ టీటీసీ పూర్తి చేశారు. వివాహమైన తర్వాత భర్త సురేశ్ ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించాలని దిల్‌సుఖ్‌నగర్‌లో ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకొన్నారు. తొలి ప్రయత్నంలోనే డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో 75 ర్యాంకు సాధించి ఉద్యోగం పొందారు. పేదరికాన్ని జయించాలనే పట్టుదలతో రాత్రి పగలు తేడా లేకుండా చదివి ఉద్యోగం సాధించినట్లు మౌనిక తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80082 78928 80085 74375

అడ్డగూడూరు, న్యూస్‌టుడే:

? అడ్డగూడూరు మండల కేంద్రంలోని మర్రిగడ్డ ఎస్సీ కాలనీలో వీధి లైట్లు వెలగడం లేదు.
- స్థానికుడు, అడ్డగూడూరు

✔ పరిశీలించి వీధి లైట్లు వేయిస్తాం.
- నరేష్, పంచాయతీ కార్యదర్శి, అడ్డగూడూరు.

బొమ్మలరామారం, న్యూస్‌టుడే:

? బొమ్మలరామారం గుడిబావి చౌరస్తా వద్ద తాగునీటి పైపులైన్ లీకవుతోంది. మరమ్మతులు చేయాలి.
- రవిశంకర్, బొమ్మలరామారం.

✔ పంచాయతీ సిబ్బందికి తెలియజేసి మరమ్మతులు చేయిస్తాం. - పద్మజ, పంచాయతీ కార్యదర్శి

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు: మాజీ ఎమ్మెల్యే సునీత



ముల్కలపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత పేర్కొన్నారు. ముల్కలపల్లి పరిధిలో భారాస నాయకుడు కల్లూరి ప్రభాకర్‌రెడ్డికి చెందిన కారు సర్వీసింగ్, ధర్మకాంటను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు, యువతులు, బాలికలు అత్యాచారాలకు, దాడులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటలు చేసి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రైతులు, మహిళలు, యువతులు అరిగోస పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల పేరుతో ప్రజలను మోసగించిందని ముఖ్యంగా మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. బతుకమ్మ చీరల పంపిణీ విషయంలో స్పష్టమైన ప్రణాళికలు లేకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. కేవలం ఆరు జిల్లాలోనే చీరలు పంచి అక్కడ కూడా పూర్తిగా ఇవ్వకుండా మధ్యలో ఆపేశారని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ పిన్నపురెడ్డి నర్సింహారెడ్డి, భారాస మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌గౌడ్, పరమేశ్‌యాదవ్, కరుణాకర్, మల్లప్ప, బిచ్చునాయక్, భాస్కర్‌నాయక్, శేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాజారామ్, సత్యనారాయణ, బద్ధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



భువనగిరిలో మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రోటర్ క్లబ్ భువనగిరి సెంట్రల్ సభ్యులు

మోత్కూరు: మోత్కూరు పురపాలిక పారిశుద్ధ్య కార్మికులకు సద్దుల బతుకమ్మ, దసరా పండగలను పురస్కరించుకుని బుధవారం కొత్త దుస్తులను పుర అధ్యక్షురాలు గుర్రం కవిత, ఇన్‌ఛార్జి కమిషనర్ సి.శ్రీకాంత్‌లు అందజేశారు.

రామన్నపేట: వెల్లంకిలో ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ అధ్యక్షుడు ఇడెం శ్రీనివాస్, స్వరూప గ్రామ పంచాయతీ సిబ్బందికి బుధవారం దుస్తులు పంపిణీ చేశారు.

భువనగిరి: రోటరీ క్లబ్ భువనగిరి సెంట్రల్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎండీ హనీఫ్, డాక్టర్ ఎంపల్ల బుచ్చిరెడ్డి విద్యానగర్, మీనానగర్‌లో కార్మికులు దుస్తులు అందజేశారు. జ్ఞానప్రకాశ్‌రెడ్డి, ఫకీర్ కొండల్‌రెడ్డి, పాల్గొన్నారు.

భువనగిరి పట్టణం: దసరా పండుగను పురస్కరించుకుని 23వ వార్డు కౌన్సిలర్ పడిగెల రేణుక వార్డులో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. నాయకుడు ప్రదీప్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరులోని ఆర్‌యూబీ సమీపంలో బుధవారం రైలుపట్టాల పక్కన నిలబడి ఉన్న చెక్క నర్సమ్మ అనే 75 ఏళ్ల వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది కథనం ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం చిన్న కందుకూరుకు చెందిన నర్సమ్మ తరచూ ఆలేరుకు వస్తుంది. బుధవారం మధ్యాహ్నం ఆర్‌యూబీ సమీపంలో రైలుపట్టాల మీదుగా అవతలి వైపునకు వెళ్లేందుకు నిలిచి ఉంది. ఇదే సమయంలో సికింద్రాబాద్ నుంచి కాజీపేటవైపు వెళ్తున్న వందేభారత్ రైలు గాలి ధాటికి వృద్ధురాలు పడిపోయింది. ఒక కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనదారుడికి..

వలిగొండ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని లింగరాజుపల్లి-అరూర్ గ్రామాల మధ్య బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. అంబులెన్స్ సిబ్బంది కథనం ప్రకారం.. సుంకిశాల గ్రామానికి చెందిన సుంకిశాల రాములు చిత్తాపురంలో బంధువు అంత్యక్రియలకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడటంతో రాములు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని వలిగొండలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

మాజీ సర్పంచి మృతి

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: గౌస్‌కొండ మాజీ సర్పంచి కానుగు పోచయ్య ఆకస్మికంగా మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాటి సుధాకర్‌రెడ్డి, కోట మల్లారెడ్డి, పక్కీరు దేవేందర్‌రెడ్డి, వాకిటి బాల్‌రెడ్డి గొంగిడి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వెన్నెముద్దల బతుకమ్మ

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ మండలంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఎనిమిదోరోజైన రోజైన బుధవారం వెన్నెముద్దల బతుకమ్మ నిర్వహించారు. మాజీ సర్పంచి మల్లగారి



బీబీనగర్ ఎంపీడీవో కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

భాగ్యలక్ష్మీ తన నివాసంలో బతుకమ్మలను పేర్చారు. వివిధ రకాల పూలతో ఆకర్షణీయ బతుకమ్మలు రూపొందించారు. ఆటపాటలతో సందడి చేశారు.

☛ బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మహిళా ఉద్యోగులు రంగురంగుల పూలతో బతకమ్మలను పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మాజిద్, పర్యవేక్షకుడు హరి, పంచాయతీ కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, సత్తిరెడ్డి, జాకిర్ పాల్గొన్నారు.

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా, మండల పరిషత్తు కార్యాలయాల్లో మహిళా అధికారులు, సిబ్బంది బుధవారం బతుకమ్మ ఆట ఆడుతూ సందడి చేశారు. నిత్యం కార్యాలయ విధులతో సతమతమవు



జడ్పీ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళా అధికారులు, సిబ్బంది

తున్న అధికారులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా బతుకమ్మ పాటలకు కోలాటాలు వేస్తూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శోభారాణి, తుర్కపల్లి, మోటకొండూరు ఎంపీడీవోలు ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిర, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మన వార్డుకు మన ఛైర్మన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 23వ వార్డులో బుధవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామాంజులరెడ్డి, కౌన్సిలర్ పడిగెల రేణుక, పలువురు నాయకులు పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణ అమలుకు డిమాండ్



భువనగిరిలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భువనగిరి, భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భువనగిరిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామిమాదిగ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీని అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో మాదిగలకు అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్ ఈరపాక నర్సింహ్మా, నాయకులు మంద శంకర్, సందెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నేతన్నలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి

భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. చేనేత మిత్ర త్రిఫ్ట్ పథకం కింద వివిధ బ్యాంకుల్లో చేనేత కార్మికులు పొదుపు చేసుకున్న రూ.27.77 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోచంపల్లి అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ తడ్క రమేష్, టైఅండ్‌డై సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, అంకం పాండు, రాపోలు శ్రీనివాస్, భారత భూషన్ పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ.. భువనగిరి పట్టణం: పట్టణంలోని రావి భద్రారెడ్డి గార్డెన్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పట్టణం, మండలంలోని 77 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం ఇవ్వాలని భారాస నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్, నాయకులు బర్రె జహంగీర్, కుక్కుదూగు సోమయ్యా, బాషబోయిన రాజేష్, పడిగెల ప్రదీప్, కూర వెంకటేష్, మజ్‌హర్, చల్లగురుగుల రఘుబాబు, పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం ఐద్వా పోరాటం

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: మహిళల హక్కులు, సమానత్వం కోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) నిరంతరం పోరాటాలు చేస్తుందని రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. భువనగిరిలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో రెండోరోజు నిర్వహించిన జిల్లా మహాసభలో గురువారం ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన నిర్భయ, దిశ చట్టాలు కఠినంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. అనంతరం ఐద్వా జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి, కార్యదర్శి బుట్టుపల్లి అనురాధ మరోసారి ఎన్నికయ్యారు. 21 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే

మోత్కూరు, న్యూస్‌టుడే: తుంగతుర్తి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో చేపట్టే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసినందుకు బుధవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ స్కూల్ శంకుస్థాపన కోసం నియోజకవర్గానికి రావాలని కోరినట్లు చెప్పారు. అభివృద్ధిలో వెనుకబడ్డ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.

కృష్ణా నీటినే సరఫరా చేయాలని వినతి

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు పుర పరిధిలో ప్రజలకు తాగునీరుగా కృష్ణజలాలు, స్థానిక బోరు నీరు కలిపి సరఫరా చేస్తున్నారని, దీంతో తాగలేకపోతున్నామని, కేవలం కృష్ణా నీటినే సరఫరా చేయాలని కోరుతూ బుధవారం స్థానికులు గాదె వెంకటేశ్వర్లు, డి.అరవిందరాయుడు, సీహెచ్.సత్యంగౌడ్, కె.అంజయ్య, నర్సయ్య, మల్లేశం, కేఆర్‌రెడ్డి తదితరులు పుర ఇన్‌ఛార్జి కమిషనర్ సి.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. అదనపు కలెక్టర్‌కు కూడా వినతిని అందజేస్తామని చెప్పారు.

పంచాయతీ కార్యదర్శికి ఉపాధ్యాయ పోస్టు



రాజపేట, న్యూస్‌టుడే : మండలంలోని పాముకుంట పంచాయతీ కార్యదర్శిగా విధులు చేపడుతున్న ఎండీ.నజీరోద్దీన్‌కు ఎస్జీటీ విభాగంలో ఉపాధ్యాయ పోస్టు దక్కింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. నజీరోద్దీన్ ఇదే మండలంలో జేపీఎస్‌గా ఎంపికై తొలుత సోమారం అనంతరం పాముకుంటకు బదిలీ అయ్యారు. ఎస్జీటీ విభాగంలో 160వ ర్యాంకు వచ్చినందున ఈ పోస్టు రిజర్వేషన్ ప్రాతిపదికన దక్కిందని వివరించారు.

గీత కార్మికులకు రక్షణగా ఆధునిక మోకులు



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

చౌటుప్పల్(గ్రామీణం), న్యూస్‌టుడే: సేఫ్టీ మోకులు గీత కార్మికుల ప్రాణాలకు రక్షణగా నిలుస్తాయని రామన్నపేట ఎక్సైజ్ ఎస్సై ఎన్.శంకర్ పేర్కొన్నారు. గీత కార్మికుల వృత్తిలో ప్రమాదాలను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన కాటమయ్య రక్షా పథకంలో భాగంగా దండుమల్కాపురంలో గ్రామంలో 45 మంది గీత కార్మికులకు రామన్నపేట ఎక్సైజ్ పోలీస్ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కల్పించారు. ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ తిరుమలేశ్, మాజీ సర్పంచి పబ్బురాజుగౌడ్, దేవేందర్ పాల్గొన్నారు.

చదువుల తల్లిని కొలిచి.. అక్షరాలు దిద్ది



భూదాన్‌పోచంపల్లిలో సాముహిక అక్షరాభ్యాసంలో భక్తులు

భువనగిరి : దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా భువనగిరి స్వర్ణగిరి క్షేత్రంలో ఏడోరోజైన బుధవారం అమ్మవారు విద్యాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సూక్త సహిత శ్రీ మహాలక్ష్మీ హవనం నిర్వహించారు.

చౌటుప్పల్ : లింగోజీగూడెంలో కనకదుర్గ యూత్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి జనసేన పార్టీ చౌటుప్పల్ మండల కమిటీ అధ్యక్షుడు పర్నె శివారెడ్డి, రజిత దంపతులు బంగారు ముక్కు పుడక సమర్పించారు.

రామన్నపేట : దుర్గాదేవిని బుధవారం సరస్వతీ దేవి అలంకారంలో పూజలు నిర్వహించారు. వెల్లంకిలో టీపీసీసీ పూర్వ కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని శ్రీమార్కండేశ్వరస్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి సరస్వతి మాతగా భక్తులకు దర్శనం ఇచ్చింది. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

రాజపేట : రఘునాథపురంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

వలిగొండ : వలిగొండ శ్రీహరిహర త్రిశక్తి ఆలయంలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లన్ను సరస్వతిదేవి రూపంలో అలంకరించారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని కనకదుర్గ ఆలయంలో అమ్మవారు చదువులతల్లి స్వరూపం సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి జన్మనక్షత్రం మూల కావడంతో ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస



లింగోజీగూడెంలో దుర్గాదేవికి బంగారు ముక్కు పుడక సమర్పించి పూజలు చేస్తున్న పర్నె శివారెడ్డి, రజిత దంపతులు

కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామలింగేశ్వర ఆలయం వద్ద మురారిశెట్టి సందీప్, స్వాతి దంపతులు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. గుండాల మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన దుర్గామాత వద్ద బాలలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.



ఆత్మకూరు: కనకదుర్గ ఆలయంలో అక్షరాభ్యాసం

సంక్షిప్త సమాచారం

బాధ్యతల స్వీకరణ.. ఆలేరు: ఆలేరు తహసీల్దారుగా ఎన్.అంజిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భువనగిరి తహసీల్దారుగా పనిచేస్తూ బదిలీపై ఆలేరుకు వచ్చారు. ఆలేరు తహసీల్దారుగా పనిచేసిన పి.శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు.

ఎస్‌హెచ్‌వోగా.. ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు ఠాణా ఎస్‌హెచ్‌వోగా సీఐ సాల్మన్‌రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మల్కాజిగిరి సీసీఎస్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఆత్మకూరుకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌హెచ్‌వోగా ఎస్సై ఉండగా అప్‌గ్రేడేషన్‌లో భాగంగా సీఐ స్థాయికి పెంచారు.

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ ఎస్‌హెచ్‌వోగా ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. భువనగిరి గ్రామీణ సీఐగా పనిచేసిన ప్రభాకర్‌రెడ్డి బీబీనగర్ పోలీస్ స్టేషన్ స్థాయి సీఐకి పెంచడంతో రాచకొండ కమిషనర్ ఆయన్ను బీబీనగర్ పోలీస్ స్టేషన్ మొదటి సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించిన విషయం విదితమే.

నియామకం.. వలిగొండ, న్యూస్‌టుడే: మండలంలోని గోపరాజుపల్లి గ్రామానికి చెందిన సంగిశెట్టి క్రిస్టోఫర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి బుధవారం నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ అందజేసినట్లు చెప్పారు.

చెగువేరా బాటలో పయనించాలి.. చౌటుప్పల్: అన్యాయం ఎక్కడున్నా ప్రతిఘటించాలనే చెగువేరా సందేశాన్ని ఆచరించాలని జనసేన పార్టీ చౌటుప్పల్ మండల కమిటీ అధ్యక్షుడు పర్నె శివారెడ్డి ప్రజలను కోరారు. పురపాలిక పరిధి లక్కారంలో చెగువేరా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మర్ల శ్రీశైలం, అంతటి లోకేశ్, కృష్ణ, రాజు, అద్వీత, అర్నవ్ పాల్గొన్నారు.

భారాస నాయకుల అరెస్టు.. రామన్నపేట: కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మాసిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ భారాస చేపట్టిన ఆందోళనకు మద్దతుగా మండలం నుంచి బుధవారం బయలుదేరిన పలువురు పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తుందన్నారు. బద్దుల రమేశ్ యాదవ్, దోమల సతీశ్, ఎం.డి.ఆమేర్, గర్దాసు విక్రం, బత్తుల వెంకటేశ్, ఆవుల శ్రీధర్, బొడ్డుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు: కొండగల్‌లో బుధవారం ప్రారంభమయ్యే భారాస పాదయాత్రకు మోత్కూరు నుంచి బయలుదేరిన ఆ పార్టీ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. యూత్ అధ్యక్షుడు కంచర్ల క్రాంతికుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మొరిగాల శ్రీను, జిట్ట సాయికుమార్, ఎ.విద్యాసాగర్, బి.శ్రీను, జి.మల్లికార్జున్‌లున్నారు.

ఎన్నిక.. మోత్కూరు: మోత్కూరు పట్టణ సీపీఎం కార్యదర్శిగా రాచకొండ రాములమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొల్లూరి మల్లేశం బుధవారం విలేకరులకు తెలిపారు. పట్టణంలోని మహిళా సమస్యలపై ఉద్యమాలు చేపడతానని రాములమ్మ పేర్కొన్నారు.

భాజపా సభ్యత్వాలు.. తుర్కపల్లి: తుర్కపల్లి మండలంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం మండల కేంద్రంలో యువకులు పార్టీ సభ్యత్వాలు తీసుకునేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు శత్రునాయక్, యువమోర్చా మండల అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, కుమారస్వామి, పాండు, ప్రవీణ్, మోహన్‌నాయక్, నరేందర్‌నాయక్, శ్రీనివాస్, కృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం వర్ధంతి.. భువనగిరి గంజ్: బహుజనల రాజ్యాధికారమే కాన్షీరాం ఆశయమని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్ అన్నారు. కాన్షీరామ్ వర్ధంతిని భువనగిరిలోని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

☛ డీఎస్పీ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లింగస్వామి, శ్రీకాంత్, అశోక్, రవి, నరేందర్, నవీన్ పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షురాలిగా నియామకం.. రాజపేట: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన చేర్యాల సుగుణ నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ తెలిపారు. నియామక పత్రాన్ని బుధవారం అందించారు.

నియామక పత్రాలు అందుకున్న యువత.. తుర్కపల్లి: తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామానికి చెందిన ఎర్రగుంట బాలకృష్ణ, కర్శలగడ్డతండాకు చెందిన గుగులోతు దస్లి, బద్దుతండాకు చెందిన గుగులోతు శ్రీకాంత్, దత్తాయిపల్లికి చెందిన శైలజ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో బుధవారం ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం.. భువనగిరి పట్టణం: బీసీలు రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా పనిచేయాలని శక్తి మిషన్ వ్యవస్థాపకుడు కర్తాల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీలు చదువును ఆయుధంగా మలుచుకుని ఎదగాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కొల్పుల అమరేందర్, మల్లేషం, చిక్కా ప్రభాకర్, భాస్కర్, రాజేష్ పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి.. యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: వికలాంగుల సహకార సంస్థలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేసి, చర్యలు చేపట్టాలని వికలాంగుల నెట్‌వర్క్ జిల్లా కన్వీనర్ సర్దార్ సీతాల్ సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం యాదగిరిగుట్టలో విలేకరులతో మాట్లాడారు. 10 ఏళ్ల కాలంలో దివ్యాంగులకు బడ్జెట్‌లో కేటాయించింది ఎంత, ఖర్చులేమిటి, పథకాలు అమలుపై అనేక అవకతవకలు జరిగాయని వాటిపై విచారణ జరపాలని కోరారు.